క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

పాతపట్నం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.వి.రత్నకుమారి శుక్రవారం తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదివి ఉండాలన్నారు. 5వ తరగతి స్థాయిలో తెలుగు, ఇంగ్లిష మీడియంలో ప్రవేశ పరీక్ష సిలబస్ ఉంటుందన్నారు. ఏప్రిల్ 20వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్లు 461 మంది..

నరసన్నపేట: ఈ నెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్‌కు నియోజకవర్గంలో 461 మంది ఓటర్లు ఉన్నారని తహసీల్దార్ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. నరసన్నపేట మండలంలో 200 మంది, జలుమూరులో 102 మంది, సారవకోటలో 66 మంది, పోలాకిలో 93 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఫైనల్ ఓటర్ల జాబితా ఇదేనన్నారు.

నేటినుంచి రాజులమ్మ జాతర

పొందూరు రూరల్: మండలంలోని దళ్లవలస గ్రామంలో గల రాజరాజేశ్వరి మాత (రాజులమ్మ) జాతర శని, ఆదివారాల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ పూజారులు(దాసులు) వెంపడాపు పాపారావు, సత్యం శుక్రవారం తెలిపారు. జాతర ఏర్పాట్లను ఆమదాలవలస సీఐ, పొందూరు ఎస్‌ఐలు పరిశీలించి కమిటీ సభ్యులతో మాట్లాడారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.

రూ.50 వేల విరాళం



విరాళం అందజేస్తున్న నరసింహమూర్తి

హిరమండలం: సత్యసాయి నూతన మందిరం నిర్మాణానికి స్థానిక ప్రేమసాయి వృద్ధాశ్రమ వాసి కోరాడ నరసింహమూర్తి శుక్రవారం రూ.50 వేల సాయం అందజేశారు. ఆశ్రమ అధ్యక్షుడు అంధరవపు అబ్బాయికి ఈ మొత్తాన్ని అందించారు. నరసింహమూర్తిని పలువురు అభినందించారు. కోఆర్డినేటర్ సాయిబాబు, జోనల్ కన్వీనర్ చంటి, మందిరం కన్వీనర్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలతో జీవితాలు నాశనం



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సత్యనారాయణ

పొందూరు: జీవితాన్ని అంధకారంలోకి నెట్టే గంజాయి, సారా, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పొందూరు ఎస్‌ఐ వి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని లుట్టపేటలో సంకల్పం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు కొంతమంది యువకులు బానిసలుగా మారి భవిష్యత్తును అంధకారంలోకి నెట్టుకుంటున్నారన్నారు. గంజాయి సేవించినా, గంజాయితో పట్టుబడిన కేసులు తప్పవని హెచ్చరించారు.


రోడ్డు నిర్మాణంపై ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు



ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు చేస్తున్న జమ్ము ఎస్సీ రైతులు

నరసన్నపేట: తమ సమస్య పరిష్కరించాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ)ను మండలంలోని జమ్ము పంచాయతీకి చెందిన ఎస్సీ రైతులు ఆశ్రయించారు. ఈ పంచాయతీ పరిధిలోని పొన్నాడపేటకు తమ భూముల మధ్యలో నుంచి కొందరు రోడ్డు నిర్మాణం చేస్తున్నారని ఎన్‌హెచ్‌ఆర్‌సీ నరసన్నపేట నియోజకవర్గ చైర్మన్ కె.చిన్నవాడు శుక్రవారం తెలిపారు. రైతులును సంప్రదించకుండా పొలాల మధ్యలో నుంచి రోడ్డు వేస్తున్నారని, పలువురు రైతులు 5 నుంచి 8 సెంట్లు వరకు నష్టపోతున్నారన్నారు. అగ్ర వర్ణాలకు చెందిన కొందరు తమ విజ్ఞప్తిని పట్టించుకోకుండా దౌర్జన్యంగా రోడ్డు వేస్తున్నారని ఫిర్యాదు చేశారు. రైతుల విజ్ఞప్తి మేరకు ఆర్డీఓ సమక్షంలో సంప్రదింపులు జరిపినా తగిన పరిష్కారం లభించలేదన్నారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ నేషనల్ చైర్మన్ సంపత్‌కుమార్ స్పందించి హైకోర్టులో రోడ్డు పనులపై స్టే వేశారన్నారు. స్టే ఆర్డర్ కూడా వచ్చిందన్నారు. ఎస్సీ రైతులకు ప్రభుత్వం న్యాయం చేసే వర కు ఎటువంటి పనులు చేయకూడదన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



చెత్తను తరలిస్తున్న కార్మికులు

కొత్తూరు: మండల కేంద్రంలో శుక్రవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మురుగునీటి కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. చెత్తను ప్రత్యేక వాహనం ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలించారు. సర్పంచ్ పడాల కృష్ణవేణి పర్యవేక్షించారు.

రహదారులా.. పెంటకుప్పలా?



లక్ష్మీనర్సుపేట గ్రామానికి వెళ్లే రోడ్డులో పెద్దకోట జంక్షన్ వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

- కంపుకొడుతున్న గ్రామ ప్రవేశాలు
- ఈగలు, దోమలకు నిలయాలుగా మారిన వైనం
- అంతంత మాత్రంగానే పారిశుద్ధ్య పనులు
- ప్రయాణికులు, వాహనదారులకు తప్పని అవస్థలు



ఎల్.ఎన్.పేట మండల కేంద్రంలో అలికాం-బత్తిలి రోడ్డు పక్కన వేసిన వ్యర్థాలు

ఎల్.ఎన్.పేట:

గ్రామీణ రహదారుల పక్కనున్న ఖాళీ ప్రదేశాలు పెంటకుప్పల్లా మారుతున్నాయి. ఊరిలోకి వెళ్లాలన్నా.. ఊరి నుంచి బయటకు రావాలన్నా పెంటకుప్పల మధ్య నుంచి రాకపోకలు చేయాల్సిన దుస్థితి. రోడ్డుకు ఇరువైపులా చెత్త వేయకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ ఇదేమీ పట్టనట్లు చాలాచోట్ల వ్యవహరిస్తున్నారు. గ్రామీణ ప్రాంత రోడ్లు వ్యర్థాలతో నిండిపోతున్నాయి.

నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు..

రూ.లక్షలు ఖర్చుపెట్టి నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు పలుచోట్ల నిరుపయోగంగా ఉన్నాయి. ఈ కేంద్రాలు ఎందుకు నిర్మించారో తెలియని పరిస్థితి. చెత్త నుంచి సంపద తయారీ పరిస్థితి అటుంచితే చెత్త సేకరణ లేకుండా పోయిందని పలువురు వాపోతున్నారు. ఈ కేంద్రాలను ఎందుకు వినియోగించటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. చెత్తను గ్రామ శివారులోని రోడ్డు పక్కన పడేయడంతో రోజురోజుకూ కొండల్లా చెత్త పేరుకుపోతుంది. రోడ్డు పక్కనున్న చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాల్సిన పంచాయతీ, గ్రామ సచివాలయ ఉద్యోగులు అదే రోడ్లపై ప్రతీరోజు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

పాతపట్నం నియోజకవర్గంలో...

పాతపట్నం నియోజకవర్గంలో 158 పంచాయతీలున్నాయి. హిరమండలం, పాతపట్నం మేజర్ పంచాయతీలతోపాటు అన్ని పంచాయతీల్లోనూ ఇదే దుస్థితి నెలకొంది. నియోజవకర్గంలోని 126 గ్రామ పంచాయతీల్లో చెత్త సేకరణ కేంద్రాలను నిర్మించారు. వీటిలో ఏ ఒక్కటి కూడా వినియోగంలో లేదు.

ఈగలు, దోమలు వ్యాప్తి..



భరించలేనంత కంపు మధ్య లో నుంచే రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. ఆర్అండ్‌బీ రోడ్డు పక్కనే చెత్త, చెదారం పడేయటంతో ఈగలు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. పలువురు వ్యాధుల బారిన పడుతున్నారు. రోడ్డు పక్కన చెత్త లేకుండా చర్యలు తీసుకోవాలి.

– జోగి దుర్గారావు, పెద్దకోట, ఎల్.ఎన్.పేట

చర్యలు తీసుకుంటాం



రోడ్డు పక్కనున్న వ్యర్థాలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. రోడ్డు పక్కన చెత్తవేయడం వలన కలిగే నష్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తాం. పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులతోనూ సమావేశమై ఇకనుంచి రోడ్డు పక్కన చెత్త వేసే వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేసేలా చర్యలు తీసుకుంటాం. మండల కేంద్రంలోని వ్యాపారులు, ప్రజలు సహకరించాలి.

– పైడి శ్రీనివాసరావు, ఎంపీడీఓ, ఎల్.ఎన్.పేట

దర్జాగా.. కబ్జా

- పీఏసీఎస్ స్థలంలో దుకాణం ఏర్పాటు



పీఏసీఎస్ స్థలంలో పెట్టిన దుకాణం

నరసన్నపేట: మేజరు పంచాయతీలో ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా చేసేస్తున్నారు. పగలు చూస్తున్నారు.. రాత్రి సమయంలో ఆక్రమించేస్తున్నారు. కూటమి కార్యకర్తలు ఇష్టానుసారంగా ఆక్రమణలకు పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. తాజాగా పైడితల్లి కూడలిలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి (పీఏసీఎస్) చెందిన స్థలంలో గురువారం రాత్రికి రాత్రే దుకాణం(బడ్డీ) వెలిసింది. ఇదే ఆవరణలో తాగునీటి బోరు ఉంది. దీని పక్కనే బడ్డీ పెట్టారు. పంచాయతీ సిబ్బందికి తెలిసినా చోద్యం చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా తహసీల్దార్, ఎంపీడీఓ, పంచాయతీ ఈఓలు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇటీవల పైడితల్లి ఆలయానికి వెళ్లే మార్గంలో అవతార్ మెహర్ బాబా మందిరం ఎదరుగా ఒక బడ్డీ పెట్టడం, పక్కనే ఉన్న స్థలాన్ని కొందరు ఆక్రమణ చేయడానికి కంచె వేయడంపై పత్రికల్లో వార్తలు ప్రచురితం కావడంతో పంచాయతీ సిబ్బంది స్పందించారు. దీనిపై కూడా తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన నాయకులు



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కోట గోవిందరావు, కె.వి.జి.సత్యనారాయణ

ఆమదాలవలస: మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని పాలకొండలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.జి.సత్యనారాయణ, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావు శుక్రవారం తెలిపారు. ఆమదాలవలస నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారన్నారు.

ఘనంగా రామయ్య సంబరాలు



అరటి గెలలు సమర్పిస్తున్న భక్తులు

జలుమూరు: మండలంలోని తిమడాంలో మాఘ మాసం శుక్రవారం రాత్రి రామయ్య సంబరాలు ఘనంగా నిర్వహించారు. రాముడి కీర్తనలు ఆలపిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. రాముడి చిత్రపటం, పూజా సామగ్రితో తిరువీధి నిర్వహించారు. అనంతరం ప్రత్యేక భజనలు ఏర్పాటు చేశారు. అరటి గెలలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



ఆనందరావును సత్కరిస్తున్న రెడ్డి శాంతి, పార్టీ నాయకులు

కొత్తూరు: గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ బలోపేతం కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నంలోని పార్టీ కార్యాలయంలో ఇటీవల పార్టీ మండలం అధ్యక్షుడిగా నియామకమైన గండివలస ఆనందరావును శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా రెడ్డి శాంతి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తనూ పార్టీ గుర్తిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. పార్టీ నాయకుడు చింతాడ సూర్యనారాయణ, సర్పంచ్ ధర్మారావు, రంజిత్, ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన



ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు శాంతారామ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

పొందూరు: ప్రమాద సమయంలో గాయపడిన వారికి ప్రథమ చికిత్సను అందించడం ద్వారా వారి ప్రాణాలను కాపాడవచ్చునని ఎంఈఓ–2 పట్నాన రాజారావు, ఇండియన్ రెడ్‌క్రాస్ సభ్యులు కొల్లకూరి శాంతారామ్ అన్నారు. పొందూరు ఎర్రావారి కల్యాణ మండపంలో శుక్రవారం స్థానిక ఆడపిల్ల సేవా సొసైటీ చైర్‌పర్సన్ మద్ది లావణ్య ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులకు సీపీఆర్ ఎలా చేయాలి, ప్రమాద సమయంలో తగిలిన గాయాలకు ఎలా ప్రథమ చికిత్స చేయాలి వంటి విషయాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులను ఘనంగా సత్కరించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ట్రైనర్స్ రమణ, సత్యనారాయణ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

శత శాతం ఉత్తీర్ణత సాధించాలి

బూర్జ: పది, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా డాక్టర్ బి.ఆర్.అంబేడ్క ర్ గురుకులం విద్యాలయం జిల్లా కోఆర్డినేటర్ ఎస్.బాలాజీ అన్నారు. శుక్రవారం కొల్లివలస డాక్టర్ బి. ఆర్.అంబేడ్కర్ గురుకులంలో పదో తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీసీఓ మాట్లాడుతూ.. పరీక్షలో భయం వీడి ఆత్మవిశ్వాసంతో రాసి మంచి మార్కులు సాధించాలన్నారు. ఎంఈఓలు ఎస్.శ్యామసుందరరావు, బి.ధనుంజయరావు, గురుకులం ప్రిన్సిపాల్ డి.దేవేంద్రరావు, పూర్వ ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ, దుప్పలవలస ప్రిన్సిపాల్ బి.బుచ్చిరాజు, ఎస్‌ఐ ఎం.ప్రవల్లిక, వైస్ ప్రిన్సిపాల్ లక్షణరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతం

ఆమదాలవలస: మెట్టక్కివలసలో గల సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కన్నేపల్లి కామావధానులు ఆధ్వర్యంలో మహిళా విభాగం సమక్షంలో శుక్రవారం సామూహిక సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. పండ్లు, స్వీట్లు, పసుపు, కుంకుమ అందజేశారు. మహిళా విభాగం ఆధ్యాత్మిక కోఆర్డినేటర్, సేవాదళ్ కోఆర్డినేటర్, తదితరులు పాల్గొన్నారు.

సందడే..సందడి



నరసన్నపేట: నృత్యం చేస్తున్న విద్యార్థినులు



పాతపట్నం: డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెండో సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు పలికారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.పవన్, విశ్రాంత ప్రిన్సిపాల్ నారాయణస్వామి మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్నందున ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలన్నారు. పరీక్షలు బాగా రాసి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సినిమా పాటలకు నృత్యాలు చేశారు. హెచ్ఎంలు వెంకటరావు, శ్రీనివాసరావు, వసతి గృహ వార్డెన్లు లక్ష్మీ, తారక్ పాల్గొన్నారు.

లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

పాతపట్నం: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని వాటి సాకారానికి కృషి చేయాలని విజ్ఞాన్ పాఠశాల కరస్పాండెంట్ డి.గంగాధర్ అన్నారు. స్థానిక బ్రాహ్మణవీధిలో ఉన్న విజ్ఞాన్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి నుంచి విద్యార్థికి కీలక దశ అని అన్నారు. విద్యార్థులపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ ఇక్కట్లు

ఆమదాలవలస పట్టణంలోని లక్ష్మీనగర్‌లో ప్రయాణికులకు నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడం లేదు. ఈ రహదారిలో లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు సైకిళ్లను పార్కింగ్ చేస్తారు. సుమారు 15 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. రెండు కల్యాణ మండపాలు, సినిమా థియేటర్ కూడా ఉన్నాయి. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీస్, మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని లక్ష్మీనగర్ వాసులు కోరుతున్నారు. – ఆమదాలవలస



వాహనాల తనిఖీ

ఎల్.ఎన్.పేట మండల కేంద్రంలో సరుబుజ్జిలి ఎస్‌ఐ బి.హైమావతి పోలీస్ సిబ్బందితో కలిసి శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. ఆటో యజమానులు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దన్నారు. మోటారు వాహన చట్టాన్ని ఉల్లంఘిస్తే అపరాధ రుసుం విధించటంతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. వేగం కంటే సురక్షితంగా గమ్యానికి చేరుకోవటం ముఖ్యమన్నారు. – ఎల్.ఎన్.పేట



వైభవంగా..

ఆమదాలవలస మండలంలోని చిట్టివలసలో గూసరమ్మ సంబరాలు శుక్రవారం నిర్వహించారు. ప్రతీ మూడేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ సంబరాల్లో దాసురాలు నారాయణమ్మ, చెంచయ్యతోపాటు సుమారు 50 కుటుంబాలకు చెందిన వారంతా చెవ్వాకులపేట సమీపంలో గల వంశధార నదికి వెళ్లి స్థానాలు చేశారు. ఇంటికి వచ్చి మొక్కలు చెల్లించుకున్నారు. నరసన్నపేట మండలానికి చెందిన చెంచుల ప్రదర్శన ఆకట్టుకుంది. సర్పంచ్ గుజ్జల లక్ష్మీణరావు, గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. – ఆమదాలవలస రూరల్



నరకయాతన

ఎల్.ఎన్.పేట మండలంలోని మారుమూలన ఉన్న గోలుకుప్ప గిరిజన గ్రామానికి వెళ్లే రోడ్డు రాళ్లతెలి నడిచి వెళ్లేందుకు వీలులేకుండా పోయింది. అలికాం–బత్తిలి ప్రధాన రహదారి నుంచి సుమారు పది కిలో మీటర్ల దూరంలో గ్రామం ఉంది. దశాబ్ద కాలానికి పైగా మరమ్మతులు చేపట్టలేదు. ద్విచక్ర వాహనంపైనా వెళ్లలేని పరిస్థితి నెలకొందని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

–ఎల్.ఎన్.పేట

అమ్మ భాష అమృతం



ఆమదాలవలస రూరల్: తొగరాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సత్యనారాయణ

మాతృభాష లేనిదే మానవ మనుగడ లేదని వక్తలు అన్నారు. అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని పాఠశాలలు, కళాశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ భాష అమృతం వంటిదని మాతృ భాష గొప్పదనాన్ని ఉపాధ్యాయులు కొనియాడారు. పలువురు విద్యార్థులు కవుల వేషధారణల్లో ఆకట్టుకున్నారు. విద్యార్థులకు పద్యాలపై పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. – సాక్షి నెట్‌వర్క్



నరసన్నపేట: సత్యవరం ఉన్నత పాఠశాలలో కవుల చిత్రపటాలు, రచనలు, పద్యాల పోస్టర్లను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



పాతపట్నం: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అష్ట దిగ్గజాల (కవుల) వేషధారణల్లో విద్యార్థులు